కథా కౌముది

# నిజం - డా. డి.వి.జి శంకరరావు

**రాముడింట్లో** ఆ సన్నివేశాన్ని అస్సలు ఊహించలేదు. అందుకనే నిర్ఘాంతపోయాను. చిన్నప్పటి నుంచీ ప్రాణస్నేహితుడు కదా. వాళ్ళింటికి వెళ్ళినపుడు డోర్‌బెల్ అయినా కొట్టను. ఎకాఎకీ తలుపు త్రోసుకు వెళ్ళిపోతా! ఈసారి ఇంట్లో వాళ్ళావిడ, పిల్లలున్నట్టు లేరు. ఒక్కడే.

తలుపు త్రోయగానే చూసిన సీను. వాడు వాడి కుర్చీలో. వాడి ఒళ్ళో 'బ్యూటీ'. ఇద్దరూ తన్మయత్వంలో లోకం మరిచి ఉన్నారు. వాడి చెయ్యి బ్యూటీ తలనిమిరేస్తుంది. నన్ను చూసి ఓ క్షణం తడబడి తేరుకుని 'రారా!' అంటూ ఆహ్వానించాడు. బ్యూటీ అయిష్టంగా నావైపు చూపొకటి విసిరి ఒళ్ళోంచి తటాలున దిగింది. అసలీ కథ మీకు మొదటినుంచీ చెప్తాను.

ఐదేళ్ళ క్రితం...

మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌ని నేను. మా పీజీ విద్యార్థుల్లో ఒకమ్మాయి స్వీటీ. ఆ అమ్మాయికి నేనంటే గురుభక్తి. నాకు ఆ అమ్మాయంటే శిష్యభయం. భయం ఎందుకంటే నేనడిగిన ప్రశ్నకు జవాబు తనవద్ద లేకపోతే టపటపా కన్నీళ్ళయినా వస్తాయి లేదా 'నీ అంతు చూస్తానన్న' లెవెల్లో కళ్ళయినా ఎర్రబడతాయి. ఓ ఆదివారం నేను ఇంటిపై పోర్షను నుండి చూస్తుండగా ఓ కారొచ్చి ఆగింది. స్వీటీ దిగి ఓ గిఫ్ట్ బాక్స్ జాగ్రత్తగా పట్టుకుని మా యింట్లోకి వస్తుంది. నేను దిగి వచ్చేలోగా మా ఆవిడ, పిల్లలు తనని రిసీవ్ చేసుకుని కూర్చో బెట్టి ఉన్నారు.

"నమస్కారం సార్" నన్ను చూసి నిల్చుంది స్వీటీ.

"కూర్చోమ్మా! ఏమిటీ విశేషం?"

"ఏమీలేద్సార్. మీకో గిఫ్ట్ తెచ్చాను. నచ్చుతుందో, నచ్చదో తెలీదుకానీ ఇవ్వాలనిపించింది."

"కొంపదీసి బాంబు కాదుకదా" మొన్ననే చివాట్లు పెట్టాను. అందుకనే మనసులో అనుమానమొచ్చింది.

"ఎందుకమ్మా. ఇవన్నీ" అన్నాను కానీ ఏమిటా అని మనసుదొలిచేస్తుంది.

స్వీటీ 'గిఫ్ట్' రివీల్ చేసింది. అది చిన్నకుక్కపిల్ల. పిల్లలు - గాయత్రి, శివ ఎగిరి గంతేశారు. "హేయ్" అంటూ మా ఆవిడకూడా ఆనందం దాచుకోలేదు.

"ఓహ్. క్యూట్ పప్పీ. థాంక్సమ్మా స్వీటీ. పిల్లలు పప్పీ నొకదాన్ని తీసుకురమ్మని ఎప్పటినుంచో పోరుతున్నారు. మీ సార్‌కి అవి ఇష్టముండవు."

"అయ్యో! మీకు ఇష్టముండవా సార్. పోనీ పిల్లులంటే ఇష్టమా!"

"ఆయనకి మనుషులంటేనే ఇష్టముండదు. ఇంకా జంతువులు కూడానా!" సెటైర్ వేసింది లత. ఆ ఆనందంలో.

పిల్లలు దాన్ని ఓన్ చేసేసుకున్నారు అప్పుడే

"ఏ బ్రీడ్ అమ్మా ఇది స్వీటీ?"

"టిబెటిన్ మాస్టిఫ్ సర్. చాలా ఫెరోషియస్. నాకు డాగ్స్ చాలా ఇష్టం. ఇది పెద్దయ్యాక మీకు నచ్చుతుంది సార్ డెఫినెట్‌గా" కాసేపు తిండీ, ట్రయినింగు, జాగ్రత్తలు తదితర విషయాలు మాట్లాడి ఆ అమ్మాయి వెళ్ళిపోయింది.

ఆ కుక్కపిల్లకు ముగ్గురూ కలిసి 'క్యూటీ' అని పేరు పెట్టారు. ఫెరోషియస్ మాటేమోగానీ ఫ్రెండ్లీ డాగ్ అయిపోయింది వీరి ట్రయినింగులో. ఎవరింటికి వచ్చినా 'మీరెళ్ళి చూళ్ళేరా?' అంటూ ఓ లుక్కిచ్చి ఆపై డ్యూటీ చేస్తుంది.

దానివల్ల నాక్కలిగిన నిఖార్సయిన లాభం మా ఆవిడ పోరు తగ్గింది, సాయంత్రం షికారుకీ, సినిమాలకీ వెళ్దామన్న కోరికలు తగ్గి.

మా ఆవిడకి జరిగిన ఏకైక ఆశాభంగం దాని బ్రీడ్ గురించే. ఇంటర్నెట్ అంతా వెదికింది టిబెటన్ మాస్టిఫ్ గురించి. అందులో కనబడిన జూలు, తోక, కళ్ళు ఏవీ కనబడలేదు మా క్యూటీలో. వయసు పెరిగాక వస్తాయనుకుంది. ఇంకెంత పెరగాలి, మరిరావు ఆ లక్షణాలు అని నిర్ధారించుకుంది. అలా అని దానిపై ఏ మాత్రం చిన్న చూపులేదు ముగ్గురికీ. నేను కూడా దాని ప్రేమ ప్రకటించే ధోరణికి మెత్తబడిపోయాను.

ఓరోజు రాముడొచ్చాడు. వాడుకూడా కుక్కలపై అవగాహన ఉన్నవాడే

"ఏమిటి చెల్లెమ్మా. మరీ బొత్తిగా కొత్తవాళ్ళొచ్చినా అరవని కుక్కని పెంచుతున్నావ్?"

"లేదన్నయ్యా! ఇది టిబెటిన్ మాస్టిఫ్. మీరు ఫ్రెండ్లీ అని పోల్చి ఉంటుంది. లేకపోతే మీద బడి రక్కేస్తుంది."

మా ఆవిడ దగ్గర్లో లేని సమయం చూసుకుని వాడు నాతో అన్నాడు "నీ బొంద మాస్టిఫ్‌రా ఇది. ఊరకుక్క. చూస్తే తెలియడంలా. అనవసరంగా రాచమర్యాదలతో పెంచుతున్నారు."

"గట్టిగా అనకురా. మీ చెల్లెమ్మ వింటే నీ అంతు చూస్తుంది. అయినా కుక్క ఏదైతే ఏంరా! "కుక్కా బై ఎనీ నేమ్ ఈజ్ కుక్కా నా ఉద్దేశ్యంలో"

"ఏడ్చినట్టుంది" అన్నాడు. క్యూటీపై వాడి చులకన భావం మాత్రం ఏ మాత్రం మారలేదు ఎన్నేళ్ళయినా.

అయితే నా సలహాని మాత్రం మర్చిపోయాడు. ఏమరుపాటుగా ఒకరోజు లత ఉండగానే క్యూటీని పోవే 'ఊరకుక్కా' అంటూ నోరుజారాడు. అంతే. మా ఆవిడ చేతిలోని వేడి టీ కప్పు 'పొరపాటున' జారి వాడి మీద పడింది. ఆ అనుభవం వాడికి జ్ఞానాన్ని ప్రసాదించింది. మరెప్పుడూ వారి ముగ్గురి ఎదుటా క్యూటీని తూలనాడలేదు.

ఈ మధ్య రాముడు వచ్చినప్పటికి క్యూటీతోబాటు, ఇంకో పప్పీ ఉంది.

"అరే ఇది బాగుందే ఎక్కడిదీ?"

"మా వెట్ డాక్టరు ఆధ్వర్యంలో, వేరే వాళ్ళ దగ్గర ఒరిజినల్ టిబెటిన్ మాస్టిఫ్ ఉంటే జత కలిపించాం. ఇది దాని పిల్లనే."

"తెలుస్తుందోయ్. ఆ చెవులు, ముక్కు చూడు. ఇట్టే చెప్పేయొచ్చు. అయినా ఒకటే పుట్టిందా?"

"లేదురా. ఆరు పుడితే హాట్ కేకుల్లా తలా ఒకరు తీసుకుపోయారు. అన్నీ పెంచడం కూడా కష్టమేకదా! ఈ ఒక్కటి లత ఉంచింది."

"ఇది ఒరిజినల్ బ్రీడ్‌రా. నాకు మాత్రం ఇవ్వరేం?" అంటూ పప్పీని చేతిలోకి తీసుకున్నాడు.

లత రాగనే అన్నాడు. "చెల్లెమ్మా మాకు ఓ పప్పీ ఇచ్చి ఉండాల్సింది కదా!"

"అయ్యో! అన్నయ్యా క్యూటీని మీరు రానివ్వరు సరిగ్గా. దాంతో మీకు అని ఇష్టంలేదేమో అనుకున్నాను."

"అంటే మంచి బ్రీడ్.." అనబోయి గతం గుర్తొచ్చి నసిగాడు.

"ఇష్టమేనమ్మా" అంటూ.

"అయితే తీసుకెళ్ళండన్నయ్యా. జాగ్రత్తగా చూసుకోండి. దాని పేరు 'బ్యూటీ'.

ఇప్పుడు నేను షాక్ తిన్నది దాని గురించే.

మా యింటికి వచ్చినపుడు క్యూటీని తరిమినంత పనిచేసే రాముడు దాని పిల్లని మాత్రం ఒళ్ళో ఆడిస్తూ ఉన్నాడు.

"ఏదైనా మంచి బ్రీడ్ మంచి బ్రీడేరా. బ్యూటీకి ఇప్పటినుండే ఎన్ని అర్థమౌతాయో తెలుసా?" ఆరాధనగా చెప్పూపోతున్నాడు.

దానికి నాపై అయిష్టత తగ్గినట్టుంది. కొంచెం జంకుతూ నా కాళ్ళ దగ్గరకు వచ్చింది. ఫ్రెండ్లీగా తోక ఊపుతూంది. దాని తలనిమురుతూ మనసులో అనుకున్నాను.

"ఏదేమైనా ఒక అబద్దంతో దీనికి ప్రత్యేక హోదా సాధించాను ఆ రోజు వెట్ డాక్టరు - ప్లానింగూ అన్నాను కానీ అసలు విషయం చెప్తే పరిస్థితి ఇలా ఉండేదా? ఏమరుపాటుగా ఉన్నప్పుడు క్యూటీ రివ్వున గేటు దాటిన విషయం. ఆపై ప్రెగ్నెంటు కావడం. 'ఏం చెప్తాంలే' అని దాచి పెట్టాను. అయినా ఇలా పట్టుపట్టి బ్యూటీని తెచ్చుకొంటాడని నాకేం తెలుసు? కాబట్టి తప్పునాదికాదు" ఆలోచనలో ఉండగా రాముడన్నాడు.

"ఏమోయ్. బ్యూటీని ఇచ్చేసినందుకు బాధపడ్తున్నారా?"

"ఎందుకురా బాధ. ఇంత చక్కగా చూసుకుంటుంటే" మనసులో మాత్రం అనుకున్నాను" నేనాడిన అబద్ధం లతకి చెప్పాలి. లేదంటే ఎప్పుడైనా నోరు జారి నిజం చెప్పేస్తుంది. ఆనక బ్యూటీది కుక్క బతుకైపోతుంది"

Click here to share your comments on this story